క్లుప్తంగా

కండలేరులో 11.311 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.311 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణయ్య

దొరవారిసత్రం: నేలపట్టు పరిధిలోని ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ముందుగానే పాఠ్యప్రణాళిక, పీరియడ్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఎంఈఓ సూచించారు. విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం పోలయ్య ఉన్నారు.

మండల మీట్ రేపు

డక్కిలి (బాలాయపల్లె): బాలాయపల్లె మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ ఉదయం 10. 30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

వలను ధ్వంసం చేసిన తమిళ జాలర్లు

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారుల వలను శనివారం తమిళ జాలర్లు ధ్వంసం చేసి పరారయ్యారు. మత్స్యకారులు మాట్లాడుతూ తూపిలిపాళెం గ్రామానికి చెందిన కోడి గోవిందు, కోడి నాగూర్ అనే మత్స్యకారులు పీతలను వేటాడే క్రమంలో తీరం నుంచి 3 నాటికల్ మైళ్ల దూరంలో తమ వలను పరిచారన్నారు. ఆ వల చుట్టు ఎరుపు జెండా, బెండు గుర్తులు నాటామన్నారు. అయినప్పటికీ తమిళ జాలర్లు తమ పరిధిని దాటి చిన్నబోట్లు వేటాడే ప్రాంతంలో వేట సాగించి, తమ వలను స్పీడు బోట్లతో ధ్వంసం చేసి, పరారయ్యారన్నారు. ఇలాంటి సంఘటనలు చాలా సార్లు జరిగాయన్నారు. ధ్వంసమైన వల సుమారు రూ. 50 వేలు ఉంటుందన్నారు.

రక్తదానంపై అవగాహన

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం నెల్లూరు జీజీహెచ్ హాస్పిటల్ డాక్టర్లు రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ యువత రక్తదాన శిబిరాల్లో పాల్గొని, రక్తం దానం చేయాలని సూచించారు. తద్వారా ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడినవారవుతారన్నారు. సింధూజ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఉదయకుమార్, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి



కొత్తపాళెం దయాకర్‌రెడ్డి(ఫైల్)

కోట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వాకాడు ఏఎంసీ మాజీ చైర్మన్ పెనుబోలు దయాకర్‌రెడ్డి(75) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కోట మండలం కొత్తపాళెనికి చెందిన దయాకర్‌రెడ్డి నల్లపురెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. స్వర్గీయ నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఆయన రాజకీయాల్లో గుర్తింపు పొందారు. కొత్తపాళెం పీఏసీఎస్ చైర్మన్‌గా 30 ఏళ్ల పాటు దయాకర్‌రెడ్డి సేవలందించారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కే ధనుంజయరెడ్డి, కోట, చిల్లకూరు మండలాల కన్వీనర్లు సంపత్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎన్ హరీష్‌చంద్రారెడ్డి, వీ సునీల్‌రెడ్డి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్లకూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చింతవరం గ్రామం వేమారెడ్డి రామచంద్రారెడ్డి కాలనీలో నివాసమున్న ఎన్ ప్రసన్నకుమార్(22) అనే యువకుడు శుక్రవారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి బయటకు బయలుదేరాడు. అతను కాలనీ దాటిన తరువాత రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ

సైదాపురం(వెంకటగిరి): మండలంలోని యాతలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బత్రి నారాయణరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నారాయణరెడ్డికి అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న నేదురుమల్లి యాతలూరు గ్రామంలోని నారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకం అమలు చేసి, వారికి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం దొరవారిసత్రంలోని సంఘమిత్ర కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల కళ్లలో ఆనందం చూస్తుంటే రాష్ట్రంలోనే కాకుండా ఈ నియోజక వర్గంలో కూడా వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తారని ధీమా కలుగుతుందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో వైఎస్సార్ సీపీ గెలిపించాలని కోరారు. దొరవారిసత్రం మండలంలో ఇప్పటివరకు ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో 598 సంఘాల్లోని 6,011 మంది సభ్యులకు రూ.17,73,49724 నగదు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. అలాగే సున్నావడ్డీ పథకం కింద 612 సంఘాల్లోని 8,169 మంది సభ్యులకు రూ.3.25 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఇవే కాకుండా జగనన్న తోడు కింద 1,887 మంది మహిళలకు రూ.1.88 కోట్లు అందిందని చెప్పారు. వైఎస్సార్ చేయూత ద్వారా 4,732 మంది పొదుపు మహిళలకు రూ.14.33 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. డీవీ సత్రం మండలానికే ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.50,74,03,724 అందిందని ఎమ్మెల్యే చెప్పారు. జగనన్న మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఇవన్నీ కొనసాలన్నా, అందరికీ మేలు చేకూరలన్నా రానున్న ఎన్నికల్లో జగనన్నకు పట్టం కట్టాలని ఆయన మహిళలను కోరారు. నెరవేర్చలేని హామీలతో బాబు ప్రజల్లో వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సూళ్లూరుపేట నియోజక వర్గంలో రైతులను ఆదుకునేందుకు కాలువల అభివృద్ధి, ఓవైపు వర్షాలు కురిసినప్పటికీ రెండో పంట కోసం తెలుగు గంగ నీటిని విడుదల చేయించి ఆదుకున్నారన్నారు. నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, జగనన్న లేఅవుట్లు, రైతుల ఇంటివద్దే ఆర్బీకేల్లో పురుగు మందులు, ఎరువుల సరఫరా, గ్రామాల్లోనే వైద్య సేవలు తదితర సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చింది జగనన్న ఒక్కరే అన్నారు. అనంతరం వైఎస్సార్ నాలుగో విడత ఆసరా పథకం రూ.4.62 కోట్ల మెగా చెక్కును పొదుపు మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిలలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి, విశేషాలంకరణ చేసి, వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెంచలకోన డిప్యూటీ కమిషనర్‌గా సాగర్‌బాబు



సాగర్‌బాబును సత్కరిస్తున్న వెంకటేశ్వర్లు, ప్రధానార్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా సాగర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ జనార్దన్‌రెడ్డి జొన్నవాడకు బదిలీయ్యారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, ఆంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనం పలికారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు సాగర్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి,పెంచలయ్యస్వామి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట



చెక్కు అందజేస్తున్న మేరిగ మురళీధర్

గూడూరురూరల్: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం ఆయన అందజేశారు. చిల్లకూరు మండలం నెలబల్లి రెట్టపల్లి గ్రామానికి చెందిన యల్లా సుబ్బారెడ్డి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతనికి సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరైంది. శనివారం గూడూరు సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ తన నివాసం వద్ద బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం, విద్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తనకు తెలిపితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



బావి వద్ద నీరు లీక్ అవుతున్న పైపులైన్

దొరవారిసత్రం: సింగనాలత్తూరు పంచాయతీలోని పలు గ్రామాలకు నీటి సరఫరా అందించే ఆర్‌డబ్ల్యూఎస్ పైపులైన్ తాగునీటి బావి వద్దనే లీక్ కావడంతో కొద్ది నెలలుగా నీరు వృథా అవుతోంది. దీన్ని అరికట్టాల్సిన పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తమకు తాగునీరు అందడం లేదని సింగనాలత్తూరు, మేలనాలత్తూరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టి, తమ తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని పొన్నవోలు కొత్తపాళెం రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గా యాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని రామారెడ్డిపాళేనికి చెందిన చంద్ర అనే వ్యక్తి ఏరూరు నుంచి బైక్‌పై వస్తుండగా చింతవరం నుంచి మోమిడి వైపు బైక్‌లో వెళుతున్న దేవా అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న చంద్రను ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికి గాయాల య్యాయి. ఆ మార్గంలో వచ్చే వారు క్షత గాత్రులను చింతవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

ఈ– క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదు రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి భవాని

చిల్లకూరు: రైతులు తాము సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి గూడూరు భవాని తెలిపారు. మండలంలోని వేళ్లపాళెం పంచాయతీ కాకువారిపాళెం గ్రామంలో శనివారం ఈ-క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును 80 శాతం వరకు పూర్తి చేశామని చెప్పారు. ఈ నెల 15వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసేలా వ్యవసాయ సహాయకులను సమాయత్తం చేస్తున్నామన్నారు. ప్రతి రైతూ తప్పనిసరిగా దగ్గరుండి ఈ-క్రాప్ నమోదు చేయిచుకోవాలని సూచించారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు వెంకటక్రిష్ణయ్య తదితరులు ఉన్నారు.

సీనియర్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

చిల్లకూరు: మండలంలోని సీనియర్ క్రికెట్ అసోసియేసన్ సభ్యులను నేటి యువత ఆదర్శంగా తీసుకుని, క్రీడల్లో రాణించాలని అదానీ ఫౌండేషన్ కృష్ణపట్నం పోర్టు పీఆర్వో రాజేష్ రంజన్ అన్నారు. మండలంలోని ఏరూరులోని శివ గణేష్ క్రీడా మైదానంలో శనివారం సీనియర్స్ క్రికెట్ పోటీలను ఆయన బ్యాటింగ్ చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు అదా నీ ఫౌండేషన్ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. నిర్వాహకులు మధు, రఘుబాబు, మోహన్ పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా శివప్రకాష్‌రెడ్డి



గూడూరు రూరల్: గూడూరు ఉపవిద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డికి పదోన్నతి లభించింది. ఆయన అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టా రు. 2022 అక్టోబర్‌లో గూడూరు డీవైఈఓగా వచ్చిన శివప్రకాష్‌రెడ్డి ఏడాదిన్నరలోనే ఉద్యోగోన్నతి లభించడంపై పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

జలఝరి.. పంట సిరి



మండలంలో సాగవుతున్న వరి సాగు

ఈ ఏడాది రబీ కూడా అన్నదాతకు అనుకూలించింది. కండలేరు జలాల విడుదలతో చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఫలితంగా రైతుల్లో ఆశలు చిగురించి, పొలం బాట పట్టారు. సెంటు బీడు లేకుండా వరి, నిమ్మ పంటలు సాగు చేశారు. దీంతో వెంకటగిరి నియోజకవర్గంలో పచ్చని పైర్లు దర్శనమిస్తోంది.

- కండలేరు జలాలతో చెరువులకు జలకళ
- 30 వేల ఎకరాల్లో వరిసాగు

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రతి పల్లె పంటలతో కళకళలాడుతున్నాయి. నియోజకర్గంలోని చెరువులకు కండలేరు జలాలు విడుదల చేస్తుండడంతో చెరువులు నీటితో తొణికిసలాడుతున్నాయి. దీనికితోడు వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో గతంలో బీడు భూములు, ఎండిన చెరువులతో దర్శనమిచ్చే ఈ మెట్ట ప్రాంతంలో ప్రస్తుతం పచ్చదనంతో పరిఢవిల్లుతోంది. వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, డక్కిలి, బాలాయపల్లె, వెంకటగిరి మండలాల్లో గంగ బ్రాంచి కెనాల్ నుంచి సుమారుగా 30 వేల ఎకరాలకు సాగు నీరందించారు. ఇందులో 15వేల ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తున్నారు. మిగిలిన 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది ఒక సెంటు భూమి కూడా ఖాళీ లేకుండా సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. గంగ జలాలు కాలువల ద్వారా చెరువులకు చేరి, ఆయా గ్రామాల పరిధిలోని కాలువల్లో పారుతుండడంతో కర్షకులు ఈ ఏడాది కూడా వరి, పత్తితో పాటు వివిధ పంటను విస్తారంగా సాగు చేశారు.


సీఎం జగన్ మేలు మరవలేం



గంగ జలాలను విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడడంతో సత్వరమే గంగ జలాలను విడుదల చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు రోజుల నుంచి పుష్కలంగా గంగ జలాలు వస్తుండడంతో ఎంతో ఆనందంగా ఉంది. ఈ ఏడాది సీఎం పుణ్యమాని, రబీ పంటలు బాగా పండే అవకాశం ఉంది. 2ఎ, 2బీ కాలువల ద్వారా మండలంలోని అన్ని చెరువులకు సాగునీరు వస్తుంది. సీఎం జగనన్న మేలు మరువలేం.

– ఎస్ రాంగోపాల్‌రెడ్డి. గులించెర్ల, సైదాపురం మండలం

కురుగొండ్ల వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: గంగ జలాలు విడుదల చేయకుంటే దీక్ష చేస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతుల సాగు నీటి అవసరాల కోసం ఇప్పటికే కండలేరు జలాలు విడుదల చేశామని, ఆ విషయం కూడా తెలియని కురుగొండ్ల దీక్ష చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అన్నదాతల ప్రయోజనాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎళ్లవేళలా కృషి చేస్తారన్నారు. వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి తాను ఈ నెల 7వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించామని, దీనిపై స్పందించిన ఆయన టీఎంసీ నీరు విడుదల చేయాలని అధికారులకు ఆదేశించడంతో శుక్రవారం తెలుగుగంగ జలాలు విడుదల చేశారన్నారు. వెంకటగిరి త్రిభువని సెంటర్ వద్ద వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ భూమిపై గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో త్వరలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు.